# రెండు పోల్స్

ఈ వ్యాసం రెండు పోల్స్ గురించి.

పోల్స్ అంటే చాల అర్థాలు వున్నాయి. పోల్స్ అంటే నాకో జోకు, ఈ వ్యాసానికి ఏమీ సంబంధం లేనిదే, ఒకటి గుర్తుకు వస్తున్నది. ముందు అది చెప్పుకుని తర్వాత అసలు విషయానికి వద్దాం.

ఇంతకు ముందు ఒకసారి చెప్పుకున్నాం. మన సర్దార్జీ జోకులలాటివే పోలిష్ వాళ్ళ మీదా వున్నాయని. ఇది ఆ కోవకి చెందిందే మీకు తెలిసిందే ఇంకో విషయం. పోలిష్ అంటే పోలీసు కాదు. పోలెండ్ దేశంలో నివసించేవాళ్ళు.

ఇద్దరు పోల్స్ (అంటే పోలిష్ వాళ్ళు), ఒక సన్నటి పోల్ (కర్ర) ఎత్తుని కొలుస్తున్నారుట. ఒక పోల్ ఆ పోల్‌ని నిలువుగా పట్టుకుంటే, ఇంకో పోల్ ఆ పోల్ ఎక్కి టేపుతో కొలవాలని ప్రయత్నిస్తున్నాట్ట.

దారినే పోతున్న మూడో పోల్ కొంచెం తెలివైనవాడు. ఇది చూసి నవ్వుతూ అడిగాడుట, 'అలా వంగిపోతున్న ఆ సన్నటి కర్ర ఎక్కి కొలిచే బదులు, దాన్ని నేల మీద పడుకోబెట్టి కొలవచ్చుగదా' అని.

సన్నపాటి కర్ర మీద వూగిసలాడుతున్న మందపాటి రెండో పోల్ పెద్దగా నవ్వి, 'భలే చెప్పావే! మేము కొలుస్తున్నది దీని పొడుగు కాదు. ఎత్తు. పడుకోబెట్టి ఎలా కొలుస్తాం' అన్నాడు.

0 0 0

మన వ్యాసంలో పోల్స్ పోలిష్ వాళ్ళూ కాదు, పోల్సూ (కర్రలు) కాదు. ఒపీనియన్ పోల్స్. అంటే అభిప్రాయ సేకరణ అనవచ్చేమో. ఒకే పత్రికలో ఇక్కడ నిర్వహించిన రెండు పోల్స్ గురించి వుంది. అవి రెండూ ఇండియాకి సంబంధించినవే కనుక, మీతో పంచుకుందామని ఇది వ్రాస్తున్నాను.

ఒకటి ఇండియా అమెరికాకి ఎంత దగ్గరా అని. రెండవది అమెరికన్లు

ఇండియాలో వ్యాపారాలు పెట్టుకోవాలంటే ఎంత సులభం అని.

ముందుగా మొదటిది చూద్దాం.

మనలో చాలమందికి ప్రాణ స్నేహితులు, స్నేహితులు, ఫరవాలేదనిపించే వాళ్ళూ, శత్రువులూ, బద్ధశత్రువులూ వుంటూనే వుంటారు. అదే దేశాల మధ్యయితే అనేక రాజకీయ కారణాలవల్ల ఈ స్నేహ బాంధవ్యాలు ఏర్పడతాయి. ప్రభుత్వ అభిప్రాయాలు రాజకీయపరంగా వుంటే, ప్రజాభిప్రాయాలు సాంస్కృతికపరంగానో, దేశ పర్యాటనపరంగా ఔత్సాహికంగానో వుండే అవకాశం కూడా వుంది. ఎలా అయినా కూడా ఇక్కడివారికి ఇంకో దేశం గురించి అవగాహన మీడియా ద్వారానో, స్నేహితుల ద్వారానో వచ్చే ఆస్కారం ఎక్కువ. అమెరికన్లు మిగతా దేశాలవారి గురించి చెప్పే గణాంకాలిలా వున్నాయి.

బుష్ ప్రభుత్వం మాకు పాకిస్థానంటే పెసరట్టు, ఇండియా అంటే ఇష్టం లేదు అనవచ్చు. కానీ ప్రజలు అలా అనుకోవటంలేదు. గత ఇరవై అయిదేళ్ళనించీ, హారిస్ ఇంటరాక్టివ్ అనే కంపెనీ 25 దేశాల గురించి అమెరికన్లు ఏమనుకుంటు న్నారో అభిప్రాయ సేకరణ చేస్తున్నది.

ఈమధ్య చేసిన సేకరణలో, 57 శాతం పాకిస్తాను మిత్ర దేశం కాదు అన్నారు. వాళ్ళే ఇండియా గురించి చెప్పినప్పుడు, 27 శాతం మాత్రమే ఆ మాట అన్నారు. అంటే 73 శాతం మనల్ని మిత్రులుగా భావిస్తున్నారు. ఇంగ్లండ్ 74 శాతంతో ఎంతో మిత్రదేశంగా మొదటి స్థానంలో వుంది. ఇంగ్లండ్ తర్వాత, కెనడా, ఆస్ట్రేలియా, ఇజ్రాయిల్, జపాన్ ఇదే వరుసలో మొదటి ఐదు స్థానాల్లో వున్నాయి. ఇరాక్ యుద్ధాన్ని వ్యతిరేకించిన కారణం వల్ల కాబోలు, జర్మనీ ఫ్రాన్సులు కొంచెం వెనకపడ్డాయి. ఇండియా 14వ స్థానంలో వుంది.

అంతేకాదు కేవలం మూడు శాతం ఇండియా శత్రు దేశం అంటే, 18 శాతం పాకిస్థాను అమెరికాకి శత్రువు అన్నారు. ఇండియా గురించి చెప్పినప్పుడు, 20 శాతం నమ్మదగ్గ మంచి మిత్రులంటే, 43 శాతం మిత్రులే కానీ మరీ అంత పూసుకు తిరగేంత కాదన్నారు. ఓ పదిమంది ఫరవాలేదు అంటే, ఇంకో పదిమంది మిత్రులు కాదు కానీ, శత్రువులూ కాదు అన్నారు. మూడు శాతం ఇండియా శత్రు దేశం అంటే, 14 శాతం ఏమీ అనకుండా గోడ మీద పిల్లుల్లా కూర్చున్నారు.

ఇక రెండవది అమెరికన్లు ఇండియాలో వ్యాపారాలు పెట్టుకోవాలంటే ఎంత సులభం అని. ఇప్పుడదేమిటో చూద్దాం. వరల్డ్ బ్యాంకూ, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషనూ కలిసి 155 దేశాల్లో ఎక్కడ వ్యాపారాలు చేయటం సులభం అని ఒక సర్వే చేశారు. చేయటమే కాకుండా నూట యాభై ఐదు దేశాలకీ ర్యాంకులిచ్చారు. ఆ ఫలితాలు ఎలా వున్నాయో చిత్తగించండి.

ఈ ర్యాంకింగులు పది విషయాల మీద ఆధారపడి వున్నాయిట. ఆ పదీ లైసెన్సులు సంపాదించటం, ఉద్యోగాలివ్వటం, తీసేయటం, ఆఫీసు బిల్డింగులు కొనటం, వాటి రిజిస్ట్రేషన్లూ, వ్యాపారానికి కావాల్సిన అప్పులు సంపాదించటంలో సులువు, పెట్టుబడిదారులకి వారి పెట్టుబడి రక్షణ, టాక్సులు కట్టటం, విదేశీ

వ్యాపారం, కాంట్రాక్టులని సమర్థవంతంగా సూటిగా నడిపించటం, చివరిగా వ్యాపారాలు మూసేసే అవసరం వస్తే ఎంత సులభంగా చేయవచ్చు అనీ.

న్యూజిలాండ్ అన్ని దేశాల్లోకీ మొట్టమొదటి స్థానంలో వుంది. అంటే ఈ 155 దేశాల్లోనూ అక్కడే బిజినెస్ చేయటం చాల సులభమని. ఇక మన ఉపఖండం లోకి వస్తే, అన్ని దేశాలకన్నా ముందు వున్నది 55వ స్థానంలో నేపాల్. పాకిస్తాన్ 60, బంగ్లాదేష్ 65, శ్రీలంక 75వ స్థానాల్లో వున్నాయి. భారతదేశం 116వ స్థానంలో వుంది. చైనా 91వ స్థానంలో వుంది.

భారతదేశంలో వ్యాపారం ప్రారంభించటానికి 11 ప్రొసీజర్లతో, తలసరి ఆదాయంలో 62 శాతం ఖర్చు పెట్టించి 71 రోజులు పడుతుంది. అదే పాకిస్థాన్‌లో అయితే 11 ప్రొసీజర్లతో, తలసరి ఆదాయంలో 18.6 శాతం ఖర్చు పెట్టించి 24 రోజుల్లో అవుతుందిట. చైనాలో 13 ప్రొసీజర్లతో, తలసరి ఆదాయంలో 13.6 శాతం ఖర్చు పెట్టించి 48 రోజులు పడుతుంది.

అదే వ్యాపారం ప్రారంభించటానికి లైసెన్స్ కావాలంటే సగటున ఇలా వున్నాయి గణాంకాలు. భారతదేశంలో 20 ప్రొసీజర్లతో, తలసరి ఆదాయంలో 678 శాతం ఖర్చు పెట్టించి 270 రోజులు పడుతుందిట. పాకిస్తాన్‌లో లైసెన్స్ సంపాదించటానికి మన దేశం కన్నా తక్కువ ప్రొసీజర్లతో (12), కొంచెం తక్కువ రోజుల్లోనే (218) అవుతుందిటగాని, ఖర్చు మాత్రం 1173 శాతంతో ఆకాశాన్నంటుతుంది. అదే చైనాలో అయితే ఖర్చు తక్కువ (126 శాతం మాత్రమే) అయినా 30 ప్రొసీజర్లతో 363 రోజులు పడుతుందిట. ఇంకో రెండు రోజులు పండగ శెలవలు కలుపుకుంటే, హాయిగా సంవత్సరం పూర్తవుతుంది కదా!

వినాయక చవితి కథలాగా ఇదంతా చదవటానికీ, వినటానికీ బాగానే వుంది కానీ... మనకన్నా నేపాలూ, పాకిస్థానూ, బంగ్లాదేష్, శ్రీలంకా ఈ విషయంలో ఎంతో ముందు వుండటమేమిటి? వింతగా వుంది కదూ.

0 0 0

ఈ వ్యాసానికి సంబంధం లేదు కానీ, నేనిక్కడ విన్న జోకు ఒకటి గుర్తుకొస్తున్నది.

మా వూళ్ళో నల్గొండనించీ వచ్చిన మంచి మిత్రులు ఒక రావుగారు వున్నారు. ఆయన ఒక జోకు చెప్పారు. తను అమెరికాకి రాకముందు, ముఫ్ఫై ఏళ్ళ క్రితం, నల్గొండలో పని చేసేవారుట. ఆయన దగ్గరే సరిగ్గా తెలుగు రాని చురుకైన ఒక ముస్లిం యువకుడు పనిచేసేవాడు. అతను ఒక రోజు రావుగారితో ఎవరి గురించో చెబుతూ, అతను అంత మంచివాడు కాదని చెప్పాలని అనుకున్నాడు. కానీ తెలుగులో చెప్పింది వేరు.

'ఆయన మీకన్నా అద్ధాన్నం సార్!' అన్నాట్ట.

0 0 0